బహుమానము

కోర్టునుంచి అప్పుడే ఇంటికి వచ్చిన విశ్వనాథము బట్టలు మార్చుకొనక ముందే హిందూపేపరు పట్టుకొని పడకకుర్చీలో వాలాడు. కాస్మొపొలిటన్ క్లబ్బుకు వెళ్లినప్పుడే ఫలహారము బాగా చేశాడు. రాత్రికి కేరియరుతో భోజనము ఇంటికే వచ్చే ఏర్పాటు చేసుకున్నాడు. టెన్నిసు పనికూడా పూర్తి అయింది. ఇప్పుడిక తాపీగా పేపరు చదువుతూ కూర్చోవచ్చు; రాత్రి ఎనిమిదింటివరకూ తనను పలుకరించే వారూ ఆటంకపరిచేవారూ లేరూ గనుక.

మామగారు వచ్చి క్రిందటివారములో సరోజినిని తీసుకొని వెళ్లారు. ఆమె పోకడ, గ్రీష్మములో చెమటలుపోసిన శరీరానికి శీతలవాయువు సోకినట్లుగా ఉన్నది అతని ప్రాణానికి. అనిర్వచనీయమైన తేలిక, తెరపి హృదయములో కలిగాయి. హాయిగా ఎంతసేపయినా పేపరు చదువుకొనవచ్చు. ఎంత ఆలస్యంగా నయినా ఇంటికి రావచ్చును.

హిందూపత్రిక తిరగవేస్తున్నాడు. వార్తలు-విశేషాలు-ప్రకటనలు చూస్తున్నాడు.

"రాష్ట్ర విభజన కావాలి"

"మాకు ప్రత్యేకరాష్ట్రం కావాలి"

"కాందిశీకుల ఆస్తి వేలము"

"మాట్రిమోనియల్ బ్యూరో"

"వరుడు కావలెను స్మార్త బ్రాహ్మణుడు-పాతిక సంవత్సరాలకు మించిన వయస్సు కలవాడు-ఉద్యోగము చేసేవాడు.... .... కుజదోషము లేనివాడు.... .... "

"వధువు కావలెను. ముప్పది సంవత్సరాలుగల నాగరిక శిఖామణి అయిన ప్లీడరునకు, స్మార్త బ్రాహ్మణ వధువు, భారద్వాజస గోత్రముకానిది, విద్యావతి కొంచెము పొడగరి,....వంట నేర్చినది.... దరఖాస్తుతో ఫోటో పంపవలెను...." సహజ కౌతూహలముతో—తనకు అవసరము లేకపోయినా-బాగా పరకాయించి చూస్తూఉండగా, తళుక్కున ఒక ఊహ మెరుపులాగ అతని మనస్సులో మెరిసింది! తనపేరు మార్చి ఫొటోసహితముగా ఒక దరఖాస్తు పంపితే? ఏమవుతుందో?....ఏమి జవాబు వస్తుందో?....ఎవరు సంప్రతిస్తారో?.... చూడాలి తమాషా।

వెంటనే లేచి, ఫొటో ఒకటి—తానెప్పుడో క్లబ్బులో తీయించుకున్నది— ఆల్బములోనుంచి తీసి, ఆకర్షణీయమైన కాగితముమీద దరఖాస్తువ్రాసి పోస్టులో వేశాడు.

అతనికి నమ్మకమే సరోజని ఇంకా రెండునెలల వరకూ రాదని. తాను చూచాయగా చెప్పాడుకూడాను, బాగా వేవిళ్ళు తగ్గితేగాని రావద్దని. ఆమె మంచి కోసమే....మనిషి లేవలేకుండా ఉన్నది....భోజనమన్న మాటలేదు....ఒకటే పైత్య వికారముతో బాధపడుతున్నది.ఈ పైత్యము తగ్గేసరికీ ఆరోనెలో....ఏడోనెలో.... రానే వస్తుంది. సాధారణముగా పురిటికి పుట్టింటికి వెళ్లేసమయము అది. ఇంక అప్పుడేమి వస్తుంది? అయినా వాళ్లు పంపుతారా? పురుడువచ్చి....ఆమె బ్రతుకు ....ఏ మూడవ నెలనో-తాను రమ్మని వ్రాస్తే-అప్పుడుకదా ఆమెగారు పేంచేయటము! ఇంకా ఎనిమిది తొమ్మిదినెలల మాట!

దరఖాస్తు వ్రాయనైతే వ్రాశాడుగాని సరోజినికి ఆమె తండ్రికి తెలుస్తుందేమో? ఎక్కువ చదువురాని ఇరవయ్యేళ్ల పిల్లను సమాధాన పెట్టటము సులభమైన పనే! అనుభవము లేని చిన్నపిల్ల కనుక తానేమి చెప్పినా నమ్మితీరుతుంది. తన కోసము కాదనీ, తన స్నేహితుడు ఒకడు ఏపిల్లా నచ్చక-చివరకు బ్రహ్మచారిలాగ ఉండిపోవటానికి నిశ్చయించుకొన్న వానికోసమనీ పిల్లను మాట్లాడి పెట్టేవరకు తాను భారము వహించాడనీ ఏమేమిటో చెప్పి ఆమెను నమ్మించవచ్చునుగాని మామగారి మాటే ఉన్నది. అవసరమయిన దానిలో జోక్యము కలుగ జేసుకుంటే దానికి తగిన సత్కారము పొందుతాడు!

ఈ ఉత్తరము వాళ్లకెప్పుడు చేరుతుంది? వాళ్లు ఎప్పుడు జవాబు వ్రాస్తారు? వెంట వెంట తిరుగుటపాలో ఉత్తరప్రత్యుత్తరాలు నడిస్తేగాని వ్యవహారాలు తెమలవు. ఈ పద్ధతి రెండు పక్షాలవారు అవలంబించాలి. అయినా తనకున్న తొందర వాళ్లకెందుకు ఉంటుంది?

* * * *

కాస్మోపాలిటన్‌క్లబ్బు ఆవరణములో కారుదగ్గర నిలబడి పార్థసారథితో విశ్వనాథము మాట్లాడుతున్నాడు. సినెమాకు వెళ్లాలని స్నేహితుడి ప్రోద్బలముతో బయలుదేరాడు. 'Best years of our lives' అనే ఇంగ్లీషుచిత్రము చూడాలని వెళ్లారు, అక్కడ టికెట్లు దొరకక చాలామంది నిరాశతో తిరిగి పోతున్నారు. ముందుగా టికెట్లు కొనుక్కొని రిజర్వుచేసుకున్న వాళ్ళు లోపలికి వెళ్లి కూర్చున్నారు. చాలామంది క్యూలో నిలబడి టికెట్లు కొన్నారు. ఆట మొదలయ్యేవరకు నిలబడి జనమంతా విసుక్కుంటూ వెనకకు మళ్ళుతుండగా చెంచులక్ష్మి చిత్రములో నటించిన నారాయణరావు కనబడ్డాడు. ఆయనకూ టికెట్లు దొరకలేదు కాబోలు. ఆయనను చూడగానే చెంచులక్ష్మి చిత్రము చూడాలనిపించి స్నేహితులిద్దరూ ఆథియేటరుకు వెళ్లారు.

నరసింహప్రసాదితమయిన చెంచులక్ష్మి పెరిగి పెద్దదయింది. స్విమ్మింగు కాస్ట్యూముతో నదిలో ఈతకొట్టుతున్నది. కూర్చుంటే కనబడటములేదని చాలామంది నిలబడి చూస్తున్నారు.

లక్ష్మీనరసింహస్వామి చెంచితతో వైకుంఠము వెళ్లాడు. ద్వారము దగ్గరే నిలచిపోవలసివచ్చింది. లోపల ప్రవేశించటానికి ఆదిలక్ష్మి అనుజ్ఞలేదు : తన పెనిమిటి కొత్తభార్యతో వస్తున్నాడన్న వార్త తెలుసుకొని ద్వారము మూయించింది. ఏం చేస్తాడు నరసింహస్వామి అయితేమాత్రము? ఎంతటివాడయినా సమయము మించివచ్చినప్పుడు, తాటస్థ్యంగా ఊరుకోవటమే ఉత్తమమయిన పద్ధతా?

విశ్వనాథానికేమిటి ఎవరికేమిటి ఆ సవతుల తగవులాట.... ఆదిలక్ష్మి అలుక, అసందర్భము కాకపోయినా రసభంగముగా తోస్తాయి. చూడటానికి సౌఖ్యవంతముగాను - సులభముగాను-కనబడే సవతుల సామరస్యము, పొందికా- జీవితములో, పొసగినవా?

* * * *

అప్పటికి వారమయింది విశ్వనాథము వధువు కొరకు దరఖాస్తు వ్రాసి. ఆ విషయమయి జవాబు ఇంకారాలేదు. అతడు ఎదురుచూడని జాబులేవో వస్తూనే ఉన్నాయి; సరోజిని క్షేమంగా ఉందనీ, కొంచెముగా లేచి తిరుగుతున్నదనీ రెండు జాబులు వచ్చాయి.

ఈ సందర్భములో జరుగుతున్న ఆలస్యము అతనికి భరింపరానిదిగా ఉన్నది.

కఠినమయిన పది నిండుదినాలూ గడచిన తరువాత ఏలూరునుంచి ఒక ఉత్తరము వచ్చింది. దరఖాస్తు చూసుకున్నారట, ఫోటోను పిల్లచూసి మెచ్చినదట, వివరాలు తృప్తికరముగానే ఉన్నాయట! వాళ్ల బంధువులలో ఎవరికో విశ్వనాథము తెలిసినవాడేనట! ఒక నెల తరువాత ఎవరయినా స్వయముగా వచ్చి కలుసుకొని లగ్నము వగైరాలు నిశ్చయపరుస్తారనీ. 'వధువు ఫోటో పంపుతున్నాము చూసుకో'మని పెద్ద ఉత్తరము వచ్చింది.

విలాసంగా తమాషాగా రువ్వినరాయి గమ్యస్థానము చేరింది!

అవతలవాళ్ళు సహజంగానే జవాబు వ్రాశారు. ఇంత వరకు వ్యవహారం బాగానే నడచింది. ఇకముందు సంబంధం వాళ్లెవరైనా తనను చూడటానికి వచ్చినప్పుడు వ్యవహరించవలసిన విధానమేమిటి?

తన ఫోటోపంపిన తరువాతకూడా వధువు విషయమై విశ్వనాథమున కెటువంటి ఆలోచనలు పోలేదు గాని, తన ఫోటోను చూసి ఆమె మెచ్చినతరువాతనూ, ఆమె ఫోటో తనకు పంపినతరువాతనూ, మనసు కొంచెము ఉద్రేకించిన మాట నిజమే!

తాను పెండ్లికొడుకని, తనతో మాట్లాడటానికే ఇంత దూరము వాళ్లెవరో వధువుపక్షాన వచ్చినప్పుడు, తన స్నేహితుని పేరు చెప్పి తప్పుకుంటే బాగుంటుందా! తాను ఏ వంకతో తప్పుకోవాలి? ఇంతవరకు దిగినతరువాత, ఇప్పుడు తప్పుకుంటేమాత్రము అవమానము కాదూ? నలుగురూ నవ్వుతారు కూడాను.

తిరిగి వివాహమాడటానికి సాహసించకూడదా? సరోజిని సహించలేదా? ఆమెకు ఎటువంటి లోపము చేయడు. ఆమెకు తాను పీసమంతైనా అగౌరవము కలుగనీయడు.

అప్పటికి సరోజిని సమాధానపడకపోతే-ఉండనేఉన్నది నలుగురు తొక్కిన తోవ? కాని తనకు మాత్రము పొందికతో-సరసంగా-సమానంగా దక్షిణనాయ.... లాగ సర్దుకుపోదామనే ఉంది!

అయినా మనదేశపు భార్యలు భర్తకు అంతచేటు ఎదురు తిరుగరు. కొంత వరకు బిగింపుగా ఉన్నా-క్షమ ఓరిమి వాళ్లదగ్గరనుంచే నేర్చుకోవాలి.

ఎటుపోయి ఎటువస్తుందో ఎందుకయినా మంచిదే, కొన్ని ఏర్పాట్లు చేసుకొని ఉండటమని తోచిందతనికి, వధువుకు అలంకార ప్రయత్నము చేయవద్దూ? అందరి కంటె సురాజ్‌మల్లు నగల వర్తకుడు అతని నాకర్షించాడు. ఆ కంపెనీకి ఒక జాబు వ్రాశాడు, ఒక నెక్లేసు ఒక గాజులజత కావాలనీ, ముందు క్యాటలాగు పంపమని. ఈ రోజుల్లో నగలెక్కువగా ఎవరూ పెట్టుకోవటములేదు. ఉన్నవేవో పెట్టెపూజ గానే ఉంటున్నాయి. 'ఇప్పటి కవిచాలు ఈ బంగారపు హెచ్చుధరలలో'నని అని పించింది విశ్వనాథానికి.

కంట్రాక్టరు వీరయ్యకు కబురుచేశాడు. మేడమీద మరొక పడకగది. దాని ప్రక్కన ఒక చిన్న వరెండా. అటువైపుకే మెట్లు కట్టించాలి క్రిందికి దిగటానికి.

కారు ఎప్పటిదో 1936 మోడలు. గుడ్డటాపు-ఆకారు సర్వాసహ్యముగా ఉంది. కార్పొరేషను వాళ్లకు చెత్తమోయటానికి ఏమయినా పనికివస్తుందేమో! ఇప్పుడువచ్చే రకాలలో ఒకటి కొత్తదే కొనాలి.

వాళ్లెవరో వధువు వైపునుంచి తనను చూడటానికి వస్తారుకాబోలు! తను ఇంటర్వ్యూకి సిద్ధంగా ఉండాలి.

అతనిలో వెనుకటి నిరుత్సాహమూ నీరసమూ లేదు, చికాకు అసలే లేదు. ఇప్పుడు ఇంత శాంతమూ, ఉత్సాహము, నూతన జీవనము ఎట్లా వచ్చినదో అతనికే ఆశ్చర్యముగా ఉన్నది.

* * * * *

ముందుగా టెలిగ్రామునిచ్చి వధువువైపునుంచి ప్రకాశరావు అనే అయన ఒకనాటి ఉదయము రైలుదిగి విశ్వనాథము ఇంటికి వచ్చాడు. మనిషి ఆడంబర

ముగా వేషభాషలలో నాగరీకముగానే ఉన్నాడు. తనకు తెలిసిన ఆయనను పంపుతా మని వ్రాశారుగాని వచ్చిన మనిషిని తానెరుగనే ఎరుగడు.

విశ్వనాథము చాలా జాగ్రత్తగా దెబ్బగా మాట్లాడుతూ మర్యాద చేశాడు. ఆయనకూడా సాలోచనగానే ప్రశ్నిస్తూ వివరాలను తెలుసుకున్నాడు. వధువును గురించిన వివరాలు చెప్పాడు. సంగీతము బాగా వచ్చునట. చదువుకున్న పిల్ల. విశ్వనాథము జాతకము తీసుకొని వెళ్లుతూ చెప్పాడు "త్వరగా లగ్నము పెట్టించి తెలుపుతా"మని. లాంఛనాల విషయాలుకూడా ఏవో మాట్లాడాడు

విశ్వనాథానికి పని తేలికే అయింది ఆ సందర్భములో. అతను చేయవల పిన పనులు-మెలగవలసిన రీతులు ఆలోచించుకుంటున్నాడు.

*　　*　　*　　*　　*

అది మాఘమాసము, పెళ్లిళ్ల తరుణము. శుభలేఖలు ఎక్కడనుంచో ప్రతి పోస్టులోనూ వస్తూనే ఉన్నాయి విశ్వనాథానికి.

కాని తన సంగతి ఏమయిందో! వెళ్లిన ఆయన జాబు వ్రాయనూలేదు- ఏర్పాట్లు చేయనూలేదు!

ఈ లోపల విశ్వనాథము తాను చేయదలచుకొన్నవన్నీ చేసేస్తున్నాడు.

ఇంటికి పైన గదులు మెట్లు తయారు అయినాయి. హిల్‌మన్‌మింక్సు కొత్త కారును గరాజిలో ప్రవేశపెట్టారు. సురాజమల్లు కంపెనీవారు ఆర్డరు ఇచ్చిన నగలు పంపారు.

సరోజిని ఏవారము కావారము క్రమము తప్పకుండా తన ఆరోగ్యాభివృద్ధిని గురించి వ్రాస్తూనేఉన్నది. ఈసారి ఆమె జాబుతోకూడా ఒక శుభలేఖను పంపింది. ఆమె పినతల్లి కూతురుపెళ్ళి భీమవరములో చేస్తారని, మాఘశుద్ధ సప్తమినాడు లగ్నము అని.

విశ్వనాథము మనసు ఈ పెళ్లికి వెళ్ళవలెనని ఉత్సహించలేదు. అతనికి స్వంత విషయాలే చాలా ఉన్నాయి ఆలోచించవలసినవి కాని, 'సరోజినికి ఏడవ నెల వచ్చింది. ఆమె నొకసారి చూసి కాస్త సమాధానపెట్టి వచ్చేస్తే.... చూసుకో

వచ్చు తరువాతిమాట. నందో రాజా భవిష్యతి. అప్పటికి రాజెవరో, రెడ్డి ఎవరో. అటువైపులకు వెళ్ళినప్పుడు వీలుగా ఉంటే పెళ్ళికికూడా వెళ్ళిరావచ్చు ఓపూట.' అనుకొని బట్టలు సర్దుకొని అంతా సిద్ధమయిన తరువాత అతని మనసుకు వధువు ఫోటో నగలు తనతో కూడా తీసుకొని వెళ్ళవలెనన్న ఆలోచన తోచినది. వాటిని కూడా భద్రంగా పెట్టెలో అడుగుగా, సరోజినిదృష్టి వాటిమీద పడకుండా ఉండే టట్లు సర్ది పైన బట్టలు అమర్చాడు.

అత్తవారింటికి వెళ్ళగానే తెలిసింది, ఆడవాళ్ళంతా పెళ్ళికి నాలుగుదినాల క్రిందటే భీమవరము వెళ్ళారని. మరునాటి ఉదయమే పెళ్ళి.

విశ్వనాధము బావమరిదిని తోడుగా తీసుకొని బస్సులో బయలుదేరి భీమ వరము వెళ్ళాడు. ఇల్లంతా సందడిగా ఒకరిమాట ఒకరికి వినపడకుండా బాజా భజంత్రీలతో నిండిఉన్నది పెళ్ళి ఇల్లు.

అతనికి సరోజినితో మాట్లాడాలంటే వెళ్ళగానే వీలే కలుగలేదు. ఆమె పెళ్ళికూతురికి జడవేస్తూను, బొట్టు పెట్టుతూను ఆ సందడిలో ఉన్నది. స్త్రీలకు పెళ్ళిళ్ళ సమయములో భర్తల ఆలోచనే ఉండదు.

ఆరాత్రి భోజనాలపందిరిలో మగవాళ్ళు ఆడవాళ్ళు ఎదురుపడి పంక్తులుతీర్చి భోజనాలకు కూర్చున్నారు. పెండ్లికూతురు, సరోజిని, ఇంకా చాలామంది ఆడ వాళ్ళు విశ్వనాథముకు ఎదురుగా కూర్చున్నారు.

"ఈ పెళ్ళికూతురు.... ఇట్లా ఉందేమిటి? ఎవరు ఈ అమ్మాయి? తన దగ్గరున్న ఫోటోకూడా ఈ మాదిరిగానే ఉన్నదే? అయినా వ్యత్యాసము ఏమయినా ఉన్నదో,లేదో భోజనమయిన తరువాత పెట్టె తెరచి ఫోటోను చూడా"లని విశ్వ నాధము, పెళ్ళికూతురును చూచిన దగ్గరనుంచి, విస్మయపడుతున్నాడు

ఇంతలోకే నేతిగిన్నె తీసుకొని వడ్డిస్తూ ఎవరో ఒకాయన పట్టుబట్ట కట్టు కొని వచ్చాడు.

"చెయ్యి పట్టండి సార్. సరోజినీ! మీ ఆయనకు ఇంత పిగ్గేమిటే" అంటూ గబగబ నెయ్యి వడ్డించుతూ వెళ్ళిపోయాడు.

విశ్వనాథము తలఎత్తిచూశాడు. తనను చూడటానికి వచ్చిన ఆయనే వధువు బంధువు! అన్నము కలపడానికికూడా విశ్వనాథము చేతివరాలు స్వాధీనము కాలేదు!

ఆ రాత్రికి సరోజినిని ప్రత్యేకంగా పిలిచి కూర్చోపెట్టి, "నీకు ఏడవనెల వచ్చింది కదూ? మీవాళ్ళు సీమంతము చేస్తారేమోనని నేను నీకు గాజులజత, నెక్లేసు చేయించుకొని వచ్చాను. ఈ పెళ్ళి కాగానే నీవు బయలుదేరిరా. నేను ఉండటానికి వీలులేదు. తెల్లవారుజామున బస్సులో నా ప్రయాణము" అని అన్నాడు.

"అదేమిటి? లగ్నము చూడకుండా వెళ్తానంటారేమిటి? ఇంతదూరము వచ్చి ముహూర్తమయినతరువాత వెళ్లండి" అని సరోజిని బ్రతిమిలాడుతున్నది.

"నేను ప్రత్యేకంగా నిన్ను చూడాలనీ, నీకు గాజులు ఇవ్వాలనీ, వచ్చాను. పెళ్ళి చూడటానికేమిటి? వధూవరులను ఇందాక చూశానుగా. నేను వెళ్ళవలసిన అవసరము ఉన్నది" అని విశ్వనాథము అంటుండగా భోజనాల సమయములో నెయ్యి వడ్డించిన ఆయన అక్కడికేదో పనిమీదవచ్చి, "బావగారూ! సరోజిని నాకు చెల్లెలివరుస. మేము ఇన్నాళ్లనుంచీ దూరదేశాలలో ఉండటమువల్ల మిమ్ములనందరినీ చూడటము తటస్థపడలేదు. పెళ్ళికూతురు అచ్చముగా నేను ఇచ్చిన ఫోటోలాగా లేదూ? సరోజినీ! మీఆయన నీకు శ్రద్ధగా చేయించుకొని వచ్చిన బహుమానాలు స్వీకరించవే" అంటూ తన పనిమీద వెళ్ళిపోయాడు.

విశ్వనాథము చేతిరుమాలుతో పాలిపోయిన ముఖము తుడుచుకున్నాడు.